క్లుప్తంగా

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



పాయకాపురం(విజయవాడరూరల్): డివిజన్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి అన్నారు. డివిజన్‌లోని పటేల్ నగర్లో సోమవారం కల్వర్టు నిర్మాణ పనులకు కార్పొరేటర్ విజయలక్ష్మి భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ పటేల్ నగర్, ఎల్‌బీఎస్‌నగర్‌లో ఒక్కోటి, ప్రకాష్‌నగర్లో రెండు చొప్పున కల్వర్టుల నిర్మాణాలకు వీఎంసీ రూ. 10 లక్షలు మంజూరు చేసిందన్నారు. వర్షాలు పడితే వాన నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తుండటంతో కల్వర్టులు ఏర్పాటుచేయాలని స్థానికుల విజ్ఞప్తిపై వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నేతలు అలంపూరు విజయకుమార్, రామిరెడ్డి, బుజ్జి, శ్రీను, వెంకట్, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ పనులు పూర్తి చేయాలని అర్జీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానికంగ జరుగుతున్న ఆర్‌యూబీ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, మధురానగర్‌కు సిటీ బస్సులను పునరుద్ధరించాలని మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీతులసి సోమవారం స్పందనలో అర్జీ అందజేశారు. ఆర్‌యూబీ పనుల్లో జాప్యం కారణంగా ప్రజలు అవస్థ పడుతున్నారని, సిటీ బస్సులు లేక ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని, రైల్వేగేటు వద్ద గోతులను సరిచేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో మధురానగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శివాజీ, సోషల్ వర్కర్ వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శివస్వామి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తుళ్లూరు మండలం వెంకటపాలెంలోని శ్రీ రాజరాజేశ్వరీ దేవీ సమేత శ్రీ కోటి లింగేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి తెలిపారు. నగరంలోని వేముల హజరతయ్య గుప్తా కార్యాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను శివస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివస్వామి మాట్లాడుతూ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 15 నుంచి 19 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. 16న నరసింహ కల్యాణం, 17న వేంకటేశ్వర స్వామి కల్యాణం, 18న శనివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరీదేవి సమేత శ్రీ కోటిలింగేశ్వర స్వామికి మహా రుద్రాభిషేకం, శ్రీ లక్ష్మీ నారాయణ కలాణ మహోత్సవం, అనంతరం శివ పార్వతులకు నంది వాహన సేవలు జరుగుతాయని తెలిపారు. 19న దివ్య రథోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వేముల చారిటీస్ అధినేత డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తా, వేముల లక్ష్మీ సరోజ, కె.దిలీప్ కుమార్, పెరుమాళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బాల్య వివాహాలను అరికట్టాలని 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం వేడుకలు న్యూరాజరాజేశ్వరీపేటలో సోమవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలంటే సమాజంలో వివక్ష చూపడం అలవాటుగా మారిందని, తల్లి గర్భంలో ఉన్నది మొదలుకొని బాలికలపై దాడులు చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమన్నారు. అనంతరం పలువురు పెద్దలు బాలికల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాగేశ్వరరావు, షేక్ బాజీ, పాస్టర్ శ్యామ్‌సుందర్, చైల్డ్‌లైన్ సూర్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత కుట్టు శిక్షణ

ఆటోనగర్(విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని కమల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యాన మెస్సీయ ఫెలోషిప్ చర్చి ఆవరణలో మంగళవారం నుంచి పేద మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్లు ఆ ట్రైనింగ్ సెంటరు వ్యవస్థాపకులు సజ్జా జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 11 బ్యాచ్‌లకు శిక్షణ పూర్తయ్యాయని.. మంగళవారం 12వ బ్యాచ్‌కి శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే విష్ణు



గడప గడపకు మన ప్రభుత్వంలో పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. 32వ డివిజన్ 228 వ వార్డు సచివాలయ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. పార్టీ డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందర్‌పాల్, వీఎంసీ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బందితో కలిసి గడప గడపకు వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలతో కూడిన బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా శ్యాచురేషన్ పద్ధతిలో గడప గడపకు సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. అగ్రవర్ణ పేదలకు సైతం సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ఎంతో మంది జీవితాల్లో నూతన వెలుగులు ప్రసరింపజేశామన్నారు. బుడమేరు కట్ట రోడ్డులో ప్రధాన కాల్వ పునరుద్ధరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. న్యూ అయోధ్యనగర్ ప్రధాన రోడ్డులో సైడ్ కాల్వపై సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని మల్లాది విష్ణు ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

టీడీపీ చిల్లర రాజకీయాలు

నారా లోకేష్ పాదయాత్రపై పబ్లిసిటీ కోసం టీడీపీ నేతలు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు తిరస్కరించిన వ్యక్తి చేస్తున్న పాదయాత్రకు భయపడుతున్నారంటూ టీడీపీ నేతలు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. లోకేష్ పాదయాత్ర చేస్తున్నప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీస్ యంత్రాంగంపై ఉంటుందని, పోలీస్ అధికారులు అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలోనూ బొత్స సత్యనారాయణ ఒకటికి రెండుసార్లు డీజీపీ ఆఫీస్‌కు వెళ్లి అన్ని వివరాలు సమర్పించి అనుమతులు కోరిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, వీఎంసీ అధికారులు, వార్డు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు

కలెక్టర్ ఢిల్లీరావు



నలంద డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రక్తదాతలే ప్రాణదాతలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. నలంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కలిసి ఏర్పాటు చేసిన శిబిరాన్ని కలెక్టర్ ఢిల్లీరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని యువత రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన కీర్తి కిరీటం, మరణం లేని అమరుడు సుభాష్‌చంద్రబోస్ అని కొనియాడారు. నాకు రక్తాన్ని ఇవ్వండి, నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను అంటూ పోరాటం చేశారన్నారు. రక్తాన్ని దానం మాత్రమే చేయవచ్చని, ఉత్పత్తి చేయలేమన్నారు.18 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సున్నవారు రక్తదానం చేయొచ్చని, ఒక వ్యక్తి దాదాపు 168 సార్లు రక్తం ఇవ్వొచ్చన్నారు. రక్తదానం చేస్తే నీరసిస్తామనేది అపోహ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం, కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వి.వెంకటేశ్వరరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చంద్రగిరి పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి



స్పందనలో అర్జీలను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సమస్యలపై వచ్చే అర్జీలు సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వీఎంసీ విభాగ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం జరిగిన స్పందనలో ఆయన నగరవాసుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత వాటి పరిష్కారానికి వ్యూహాలను మార్చుకోవాలన్నారు. స్పందనలో మొత్తం 18 అర్జీలు రాగా అందులో పట్టణ ప్రణాళిక - 8, ఇంజినీరింగ్ - 2, పబ్లిక్ హెల్త్ విభాగం - 2, యు.సి.డి - 2, రెవెన్యూ- 4 వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, పట్టణ సామాజికాభివృద్ధి విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు.సి.డి) శకుంతల, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ కె.బి.ఎన్.ఎస్ లత, సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, తె.డి.హెచ్ శ్రీనివాసు, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



క్లాప్ వాహనాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలో మెరుగైన పారిశుధ్య నిర్వహించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వేటు తప్పదని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజారోగ్య విభాగం అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం 4వ డివిజన్ గురునానక్ కాలనీ, 6వ డివిజన్ మాచవరం డౌన్, 25వ డివిజన్ దుర్గాపురం సాంబమూర్తి రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్యం, యూజీడీ విధానాన్ని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. సాంబమూర్తి రోడ్డులో చెత్తలోడుతో వెళ్తున్న క్లాప్(క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాన్ని ఆపి తడి, పొడి చెత్తను వేరుగా సేకరిస్తున్నారో లేదో పరిశీలించారు. నగరంలో క్లాప్ వాహనాలు నెలంతా ఎంత మేరకు చెత్త సేకరణ చేస్తున్నారో పరిశీలించాలన్నారు. డివిజన్లలో ఇంటింటి చెత్త సేకరణ, కాల్వల్లో నీటి పారుదలకు అడ్డుగా ఉన్న చెత్త- వ్యర్థాలను తొలగించి నూరు శాతం డోర్ టు డోర్ బాస్కెట్ కలెక్షన్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య శాఖాధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 8, 9 తేదీల్లో తరుణీ తరంగాల మహిళా ఫెస్ట్

కృష్ణలంక(విజయవాడతూర్పు): తరుణీ తరంగాల 5వ మహిళా ఫెస్ట్‌ను ఫిబ్రవరి 8, 9 తేదీల్లో సిద్ధార్థ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని ఆ సంస్థ అధ్యక్షురాలు రావి శారద అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్త్రీలలో సృజన వెలికితీయడానికి మహిళా ఫెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు 19, మహిళలకు 12 రకాల పోటీలు జరుగుతాయన్నారు. తరుణీ తరంగాల కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ నగరంలో ఏటా అన్ని మహిళా సంఘాలను కలుపుకుని ఫెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో ప్రత్యేకంగా టీనేజీ అమ్మాయిల కోసం మనసులో మాట కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తిఉన్నవారు ఎంట్రీ ఫారమ్‌లను పూర్తి చేసి తమ కార్యాలయానికి పంపాలని కోరారు. మిడ్‌టౌన్ ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ కరంకౌర్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీదేవి, సరోజ, రాజేశ్వరి, ఝాన్సి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్‌లో అభివృద్ధి పరుగులు



సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



కస్తూరిబాయ్‌పేట ఆర్సీఎం చర్చి రోడ్డులో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కోట్లాది రూపాయల వ్యయంతో సెంట్రల్‌లో అభివృద్ధి పరుగులు పెట్టిస్తున్నామని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 30వ డివిజన్ దేవీనగర్, జీవీఆర్ నగర్, మధ్యకట్టల్లో రూ.16.63 లక్షల వ్యయంతో మూడు పవర్ బోర్ల ఏర్పాటు పనులకు సోమవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. అనంతరం రైల్వే ట్రాక్ వెంబడి రోడ్డులో మొక్కలను నాటారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్‌లో రూ. 15 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రైల్వే ట్రాక్ వెంట రోడ్డును రూ. 20 లక్షల వ్యయంతో అభివృద్ధి పరిచామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ గురునాథం, ఏఈ అరుణ్ కుమార్, స్థానిక కార్పొరేటర్ జానారెడ్డి, నాయకులు మూర్తి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గుణదల(విజయవాడ సెంట్రల్): ప్రజల చెంతకు పాలన తీసుకురావడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఒకటో డివిజన్ ఊర్మిళానగర్‌లో రూ. 20 లక్షల వ్యయ అంచనాతో సిమెంట్ డ్రైయిన్ పనులు, ఆదర్శనగర్ 4, 5 రోడ్లలో రూ. 20 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ ఉద్ధంటి సునీతతో కలిసి భూమిపూజ చేసి సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు విన్నవించిన పనులకు రూ. 40 లక్షల నిధులతో భూమిపూజ చేసినట్లు తెలిపారు. గుణదల ఆర్వోబీ స్టేజ్ -2 పనులను త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో డీఈ గురునాథం, ఏఈ వెంకటేష్, వైఎస్సార్ సీపీ నాయకులు బండి వేణు, సురేష్, కనకరావు, మానికొండ సాంబశివరావు, కొంగితల శివ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం

లబ్బీపేట(విజయవాడతూర్పు): స్థానిక 24వ డివిజన్‌లోని కస్తూరిభాయిపేట ఆర్సీఎం చర్చి రోడ్డులో రూ.20 లక్షల వ్యయ అంచనాతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో అభివృద్ధి అటకెక్కి, ప్రగతి పక్కదారి పట్టిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాతనే పాలన గాడిన పడిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒక్క 24వ డివిజన్‌లోనే రూ.12 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వంలో సమస్యలు తెలుసుకోవడంతో పాటు, సచివాలయ పరిధిలోని అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గిరిపురంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌కు మరో రెండు నెలల్లో శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈఈ గురునాథం, డివిజన్ అధ్యక్షులు ఓబిరెడ్డి వెంకట్రామిరెడ్డి, నాయకులు కొమ్ము చంటి, కుక్కల రమేష్, మరియరాణి, బొంగరాల భాస్కర రావు పాల్గొన్నారు.

నేతాజీ స్ఫూర్తితో సేవ చేయాలి



నేతాజీ జయంతి సందర్భంగా విద్యార్థుల పరమదివస్ ర్యాలీ



నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జమల పూర్ణమ్మ

మధురానగర్(విజయవాడసెంట్రల్): నేటి యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో దేశానికి సేవ చేయాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి సూచించారు. దుర్గాపురం కొత్త వంతెన సెంటర్‌లో సోమవారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు జరిగాయి. తొలుత నేతాజీ విగ్రహానికి అతిథులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కె.రాము, ఉపాధ్యక్షుడు కె.వరప్రసాద్, ఏడుకొండలు, రాము, పసుపులేటి రమేష్ పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): నేతాజీ జయంతి సందర్భంగా స్థానిక దుర్గాపురం కొత్త వంతెన సెంటర్‌లోని నేతాజీ సభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, వైఎస్సార్ సీపీ డివిజన్ కోఆర్డినేటర్ కురిటి శివ, వీబీ ఆచారి, వంశీ పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్ర ప్రత్యేకమైనదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ అన్నారు. ఎంజీరోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోసు జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత నేతాజీ చిత్రపటానికి సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, కార్యదర్శి వేములపల్లి రవికుమార్, గ్రంథాలయ సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ నేతాజీ ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి స్వాతంత్ర్యం కోసం పోరాడన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రమాదేవి, సిబ్బంది దాసి రమేష్, ఫణి బాబు, దుర్గాంబ, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు నేతాజీ స్ఫూర్తితో దేశరక్షణకు పాటుపడాలని శ్రీ విజ్ఞాన విహార పాఠశాల సంయుక్త కార్యదర్శి నాగార్జునరాజు పిలుపునిచ్చారు. సత్యనారాయణపురం శ్రీ విజ్ఞాన విహార పాఠశాలలో సోమవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకల్లో పరమదివస్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశం కోసం పాటుపడిన మహనీయుడుని అని కొనియాడారు. అనంతరం దుర్గాపురంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని దత్తత తీసుకుని విగ్రహం వద్ద విద్యార్థులు మరమ్మతులు నిర్వహించారు. కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు, తల్లి దండ్రులు, సూర్యనారాయణ మూర్తి, చక్రధారి పాఠశాల ప్రధానోపాధ్యాయిని జేవీ షణత్‌కృష్ణ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష



సమీక్ష సమావేశంలో పాల్గొన్న మల్లాది, స్వప్నిల్ దినకర్, శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పురోగతి, ఇంకా చేపట్టవలసిన పనులపై నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా గుణదల ఆర్‌ఓబీ, మధురానగర్‌లో వీఎంసీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆర్‌యూబీ నిర్మాణ పనుల వివరాలపై చర్చిస్తూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో సత్వరమే పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొందించుకుని పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, జాయింట్ డైరెక్టర్(అమృత్) డాక్టర్ కేబీఎన్ఎస్ లత, సిటీ ప్లానర్ జీవీజీఎస్ ప్రసాద్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలాజీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసు, ఏడీహెచ్ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం అంధకారం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం అంధకారమవుతుందని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలోని కేర్ అండ్ షేర్ మున్సిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు 'మత్తు పదార్థాల'పై సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలతో ఎదురయ్యే అనారోగ్య సమస్యలను స్క్రీన్‌సాయంతో విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, నవజీవన్ బాలభవన్ కోఆర్డినేటర్స్ ఎఫ్.మమత, ఎండీ వసంతకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అలైదా గువేరా, ఎస్టిఫేనియా గువేరాలను సత్కరిస్తున్న దృశ్యం

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహిళలు ఒక్కరంగానికే పరిమితం కాకుండా, టెక్నికల్, కన్‌స్ట్రక్షన్ వంటి ఎన్నో క్లిష్టమైన రంగాల్లో రాణించాలని చేగువేరా కుమార్తె అలైదా గువేరా అన్నారు. మహాత్మాగాంధీ రోడ్డులోని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం జెండర్ ఈక్వాలిటీ అనే అంశంపై సదస్సు జరిగింది. ఆమె మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి ప్రతి ఒక్కరూ తమ తమ హక్కుల కోసం ఎలా పోరాడాలో నేర్చుకోవాలని, మనం లైఫ్‌లో ఏమి ఇస్తామో అదే తిరిగి వస్తుందన్నారు. తర్వాత తరాన్ని హెల్దీగా నిర్మాణం చేయాలంటే ఇప్పటి నుంచే సమానత్వం కావాలని సూచించారు. మరో అతిథి ఎస్టీఫేనియా గువేరా మాట్లాడుతూ జీవితంలో మహిళల ప్రాధాన్యత ఎంతో ఉంటుందన్నారు. మహిళలు, పురుషులు సామూహికంగా పని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ టి. విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అలైదా గువేరా, ఎస్టిఫేనియా గువేరాలను ఘనంగా సత్కరించారు.

• దుమ్ము దుమారం





విజయవాడ భవానీపురంలో భవానీఘాట్ వద్ద సోమవారం సాయంత్రం ఒక్కసారిగా పెద్ద గాలి, దుమ్ముతో దుమారం వచ్చింది. ఇసుక తుఫానులా కనిపించిన దృశ్యాన్ని స్థానికులు తిలకించారు.

– కిషోర్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ